# కలికి కడలి

ప్రహరీగోడ తలుపు తెరుచుకున్న చప్పుడుకు మంచం మీద కూర్చుని భోజనం చేస్తున్న పద్మారావు కిటికీలోంచి చూశాడు. తను ఎప్పుడూ చూడని ఒక వ్యక్తి లోపలికి వచ్చి ఇనుప తలుపు దగ్గరగా వేసి అత్తగారి వాటావైపు వెళ్ళి తలుపు తట్టాడు. ఆ సమయంలో ఆమె ఒక్కతే ఉంటుంది. నిద్రపోతూ ఉండొచ్చు. తలుపు వెంటనే తెరుచుకోలేదు.

అతను గుమ్మం ముందే మధ్యాహ్నపు ఎండకు తడుస్తూ ఉన్నాడు. ముఖమంతా చెమట పడుతోంది. రుమాలు ఉందో లేదో! అరచేత్తో తుడుచుకుంటున్నా చెమట

మళ్ళీ పడుతోంది. అతనికి ముప్పయి సంవత్సరాలుంటాయి. సన్నగా చామనచాయలో ఉన్నాడు. అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు. అతను వేసుకున్న బట్టల్లాగా మనిషి నలిగిపోయి ఉన్నాడు.

అతను మళ్ళీ తలుపు తట్టబోతోంటే తలుపు తెరుచుకుంది. "సువ్వా వాసూ, ఎంత కాలమయింది నిన్ను చూసి! ఏమిటిలా అయిపోయావు? లోపలికి రా" అంది.

వాసు ఇంట్లోకి వెళ్ళలేదు. బయటే నిలబడి ఏదో అన్నాడు. అతని గొంతు ఎవరో కోసేసినట్టు మాటలు వినబడలేదు. అర నిమిషం పాటు ఆమె నుండి ఏ మాటా వినిపించలేదు.

"సుధకు చెప్పావా?"

"ఇంట్లో ఉందా?"

"లేదు. ఆఫీసుకు వెళ్ళింది. ఇంటికి తిరిగి వచ్చేసరికి అయిదవుతుంది. మా అమ్మాయివాళ్ళు ఈ పక్కవాటాలోనే ఉంటారు. వాసూ ఒక పని చేయి. వాళ్ళాఫీసు కొత్తపేట పోస్టాఫీసుకు ఆనుకునే ఉంటుంది. వెళ్ళి కలువు. ఒక్క నిమిషం ఆగు. అమ్మాయి ఫోను నెంబరు రాసిస్తాను..."

ఆమె రాసిచ్చిన కాయితం చొక్కాజేబులో పెట్టుకుని, "వెళ్తాను" వెనక్కు తిరిగాడు వాసు.

"సుధను తప్పకుండా కలువు. వీలు కాకపోతే కనీసం ఫోనయినా చేస్తే వచ్చి నిన్ను కలుస్తుంది".

వాసు సరే అనలేదు. తలయినా ఊపలేదు. బయటకు వెళ్ళి, తలుపు మూసి అతను వచ్చిన ఆటోలో ఎక్కి కూర్చోగానే ఆటో కదిలింది.

పద్మారావుకు భోజనం చేయబుద్ధి కాలేదు. వాసును చూడకపోయినా బావుణ్ణు. ఏం చూసి సుధ అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంది? ప్లేటులో చేయి కడుక్కుని లేచి వంటగదిలోని సింకులో పెట్టి తువ్వాలుతో చేయి తుడుచుకుని మంచం మీద పడుకున్నాడు. పెళ్ళయిన కొత్తలో తను ప్రేమించిన యువతుల గురించి చెప్పి ఇద్దరి విషయంలో వ్యవహారం పెళ్ళివరకు వచ్చిందని సుధతో చెప్పాడు. "అలాగా" అనేసి ఊరుకుంది.

"నువ్వు ఎవరినయినా ప్రేమించావా?" అని అడిగినప్పుడు మొదట్లో "లేదు" అంది. సామాన్యంగా సుధ అబద్ధాలు చెప్పదు. నిజమే అనుకున్నాడు. తర్వాత దాయడం బావుండదని అనుకుందో ఏమో! నిజం చెప్పేసింది. "వాసును ప్రేమించాసని, అతనూ తనను ప్రేమించాడని, పెళ్ళాడడానికి సిద్ధపడ్డాడని, నాన్న కులాంతర వివాహానికి ఒప్పుకోకపోవడం వలన పెళ్ళి ఆగిపోయిందని".

అతనికి సుధ మీద కోపం కలగలేదు. "మన పెళ్ళికి వచ్చాడా?" అడిగాడు.

"రాలేదు. పెళ్ళి కార్డు పంపించలేదు, పంపించాలనిపించలేదు. నా మంచి కోరుకునే వ్యక్తే, కొన్ని రోజులు బాధపడి ఉంటాడు" అంది.

"మనిషి ఎలా ఉంటాడు?"

"అతన్ని చూసి అయిదేళ్ళు పైగా అయింది. మీ అంత అందంగా, పొడుగ్గా ఉండడు".

"అతనిది ఈ ఊరేనా?"

"ఈ ఊరే! బిఎస్సీ అయ్యాక పూణెలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం దొరికింది. అతను వెళ్ళిపోయాకగానీ వెళ్ళిపోయినట్టు తెలియలేదు."

"చెప్పకుండా వెళ్ళినందుకు నీకు బాధ వేయలేదూ?"

సుధ వెంటనే జవాబు చెప్పలేదు. అతనా ప్రశ్న మళ్ళీ వేయలేదు. కొద్దిసేపు ఆగి "మీరిద్దరూ ప్రేమలేఖలు రాసుకోలేదూ" అడిగాడు.

"రాసుకున్నాం... నేను తనకు రాసిన ఉత్తరాలు పెళ్ళి వద్దనుకున్నప్పుడే పంపించేశాడు. నావి, తన ఉత్తరాలు అన్నీ కాల్చేశాను. ఇప్పుడతను నా మనసులో లేడు. పూర్తిగా తుడిపేసుకున్నాను" అంది.

అతనికింకా వాసు గురించి అడగాలనిపించింది.

సుధ అతనికి మరింత దగ్గరగా జరిగేసరికి ఏం అడగలేకపోయాడు.

రెండు వారాల తర్వాత వాళ్ళిద్దరి మధ్య వాసు ప్రస్తావన వచ్చింది. "నిన్నెప్పుడైనా దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడా?" అడిగాడు.

సుధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "లేదు... అతను మా అన్న స్నేహితుడు.

అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుండేవాడు. వాళ్ళ సంభాషణల్లో నేనూ పాల్గొనేదాన్ని. అంతే" అని కొద్దిసేపు ఆగి "మీ స్నేహితురాళ్ళ గురించి నాతో ఎన్నోసార్లు చెప్పావు. వాళ్ళ గురించి నేనెప్పుడైనా గుచ్చిగుచ్చి అడిగానా? మన మధ్య ఎటువంటి స్పర్థలు రాకుండా నువ్వు అడగకముందే వాసు గురించి చెప్పాను. అతని ప్రస్తావన మరొకసారి తీసుకువస్తే విషం తాగి చచ్చిపోతాను" అని దిండూ, చాపా తీసుకుని కింద పడుకుంది.

తర్వాత పద్మారావు వాసు ప్రస్తావన ఎప్పుడూ తీసుకురాలేదు, అనుమానం మటుకు పూర్తిగా తుడిచేసుకోలేకపోయాడు.

ఆ మధ్యాహ్నం వాసు వచ్చివెళ్ళాక పద్మారావులో ఉండిపోయిన అనుమానం రెక్కలు విదుల్చుకుంది. స్కూటరు వేసుకుని ఆఫీసుకు వెళ్ళాడు. ఆఫీసు ఇంటికి అట్టే దూరంలో లేదు. ఆఫీసులో గంటకన్నా ఎక్కువసేపు కూర్చోలేకపోయాడు. ఆఫీసర్ పర్మిషన్ తీసుకుని స్కూటర్ ఎక్కి సుధవాళ్ళ ఆఫీసుకు బయల్దేరాడు. సుధ ఆఫీసులో ఉండాలనే అనుకోసాగాడు. తనను చూసి ఎందుకు వచ్చారని అడిగితే ఏం చెప్పాలి? లేకుంటే వాసు వచ్చి ఎక్కడికైనా తీసుకెళ్ళి ఉంటాడా?

ఆఫీసులో అతనలా అడుగుపెట్టాడో, లేదో సుధ స్నేహితురాలు కనబడి "ఏదో అర్జంటు పని ఉందని సుధ వెళ్ళి గంటపైగా అయింది" అంది.

తను వచ్చి వెళ్ళినట్టు సుధతో చెప్పొద్దు అందామని నోటి చివరకంటా వచ్చింది. అనలేదు. మనసు బాధతో నిండిపోయింది. బయటకు వచ్చాడు. మనసు చిక్కుముడి అయింది. ఏం చేయాలో తోచడం లేదు. స్కూటర్ ఎక్కి కలెక్టర్ ఆఫీసు వరకు వచ్చి దానికి ఎదురుగా ఉన్న టీ దుకాణంలో ఒకదాని తర్వాత ఒకటిగా మూడు టీలు ఎండలో నిలబడే తాగాడు. దుకాణం పక్కనే ఉన్న బెంచి ఖాళీ అయితే దానిమీద కూర్చున్నాడు.

అయిదున్నర అయ్యేవరకు అక్కడే కూర్చున్నాడు. సుధ సామాన్యంగా అయిదున్నర, ఆరింటి మధ్య ఇంటికి తిరిగి వస్తుంటుంది. లేచి స్కూటర్ తీసుకుని టీ దుకాణానికి ఎదురుగా ఉన్న పెట్రోలు బంకు పక్కనే చెట్టుకింద ఆపి స్టాండు వేసి దానిమీద కూర్చున్నాడు. సుధ ఆటోలో వచ్చినా, రిక్షాలో వచ్చినా– ఆమె, వాసు పక్కపక్కనే కూర్చుని తనకు తప్పక కనబడతారు. వాసు సుధ పక్కనే అనుకుని కూర్చుంటే ఏం చేయడం? ఈ ఆలోచనలతో పద్మారావు తల బద్దలయిపోతున్నట్టుగా ఉంది. ఎండ పలచనవుతోంది.

ఆరూ పదిహేనుకు ఆటోరిక్షాలో సుధ అతన్ని దాటుకుంటూ వెళ్ళింది. చూశాడు. రిక్షాలో సుధతోపాటు వాసు ఉంటాడని ఊహించాడు. ఒక్కతే ఉంది. తనను చూస్తుందేమోనని రవంత భయం వేసింది. చూడలేదు. వాసు మధ్యలో దిగిపోయి ఉంటాడా? రిక్షా ఎక్కడినుండి వస్తోందో?

రిక్షా ముందుకు వెళ్ళాక పద్మారావు స్కూటరు రోడ్డు మీదకు తెచ్చి కూర్చుని స్టార్ట్ చేశాడు. కదిలింది. రిక్షాకు కొద్దిగా దూరంగానే నడపసాగాడు.

రిక్షా సుధను ఇంటిదగ్గర దింపిన తర్వాత రోడ్డు మలుపులో పద్మారావు ఆ రిక్షాను ఆపి, "ఇప్పుడు నీ రిక్షాలో వచ్చిన మేడం ఎక్కడ ఎక్కింది?" అడిగాడు.

"ఆనందపేటలో" అన్నాడు రిక్షావాడు.

అతన్ని ఇంకో ప్రశ్న వేయబోయాడు. అతను రిక్షా ఆపలేదు. ముందుకు వెళ్ళిపోయాడు. వాసు ఉండేది ఆనందపేటలో కాదని తెలుసు, గుండారావుపేటలో అని ఒకసారి విన్నాడు. సొంత ఇల్లు అది.

ఇంటికి చేరుకుని స్కూటరు లోపలికి తీసుకువచ్చి గోడవారగా పెట్టి కాళ్ళు, చేతులు ముఖం శుభ్రం చేసుకుని దండెం మీద ఉన్న తువ్వాలు అందుకుని ముఖం తుడుచుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. సుధ కనబడలేదు. తను విడిచిన గుడ్డలు స్నానాల గది ముందున్నాయి. స్నానాల గదిలోంచి ఆమె స్నానం చేస్తున్న శబ్దమవుతోంది. సామాన్యంగా సుధ ఈ సమయంలో స్నానం చేయదు. రాత్రి భోజనాలకు ముందు చేస్తుంది. అంతా బాగా జరిగి ఉండాలి. తనకెలా తెలుస్తుంది.

అరగంట తర్వాత స్నానాల గదిలోంచి బయటకు వచ్చింది.

"టీ కావాలా?" అడిగింది.

వద్దని తల అడ్డంగా ఆడించాడు.

"ఏమిటి డల్‌గా ఉన్నావు?"

అతనేదో చెప్పేలోపల పక్క వాటాలోంచి సుధ వాళ్ళ అమ్మ పిలుపు వినిపించింది. పిలుపు వెనకే సుధ పక్కవాటాలోకి వెళ్ళిపోయింది.

భోజనాలయ్యాక పద్మారావు మంచం మీద పడకున్నాడు. సుధ భోజనాల బల్ల దగ్గర అతనితో కూర్చుంది కానీ ఎక్కువ తినలేదు. పళ్ళెంలో పెట్టుకున్న

కొద్దిపాటి అన్నం చాలాసేపు కెలుకుతూ ఉండిపోయింది. గంట తర్వాత వచ్చి మంచం మీద అతనికి కొద్దిగా దూరంగా అటువైపు తిరిగి పడుకుంది.

వీధి దీపపు వెలుగు వెంటిలేటరులోంచి గదిలో పలచగా పడుతోంది. పది దాటింది. పక్క వాటా నిశ్శబ్దంగా ఉంది.

పావుగంటపాటు మౌనంగా ఉండి, ఆమె దగ్గరకు జరిగి నడుం చుట్టూ చెయ్యి వేశాడు. సుధ ఏడుస్తున్నట్టుగా అనిపించింది. ఆమె మీదున్న చేయి తీసి, లేచి కూర్చుని బల్ల మీదున్న దీపం వెలిగించి మంచం దిగి సుధ ముందుకు వచ్చి ఆమె చేతులు పట్టుకుని, నేలమీద కూర్చుని, "ఎందుకు ఏడుస్తున్నావు? ఏమయింది?" అడిగాడు.

పెళ్ళయిన మూడు సంవత్సరాల్లో సుధ అలా కుమిలి కుమిలి ఎప్పుడూ ఏడవలేదు. అదే మొదటిసారి.

సుధ లేచి కూర్చుని పైటతో కన్నీళ్ళు తుడుచుకుంటూ, "వాసు భార్య చనిపోయింది" అంది.

"అయ్యో... ఎప్పుడు?"

"నిన్న సాయంత్రం... గుండెనొప్పి వస్తే ఆసుపత్రికి తీసుకువెళ్తుంటే దారిలోనే చనిపోయింది. ఈ సాయంత్రం ఆనందపేట అవతల ఉన్న సమాధుల తోటలో బరియల్ జరిగింది. చూడడానికి వెళ్ళాను. వాసు చాలా మంచివాడు. ఆమెకు గుండెనొప్పి ఉందని తెలిసే చేసుకున్నాడు..." బాధపడుతూ చెబుతోంది.

తను ఎంత దుర్మార్గుడు! సుధ గురించి ఎంత నీచంగా ఆలోచించాడు! భార్యను ఎలా ఓదార్చాలో అర్థం కావడం లేదు. ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమెను ఓదార్చడానికి కూడా తను అర్హుడు కాదనిపించింది.

**ఆదివారం 'వార్త', 18 మే, 2014**

*(1967లో జరిగిన సంఘటనను గుర్తుచేసి ఈ కథ రాయించిన శ్రీమతి అత్తలూరి శోభకు కృతజ్ఞతలతో...)*